క్లుప్తంగా

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆలయ పాలకమండలి సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ నూతన పాలక మండలి సభ్యులుగా ఎస్ జ్యోతి, ఏ నాగేశ్వర్‌గౌడ్, ఎం నవీన్, టీ శ్రీనివాస్‌రెడ్డి, జీ నర్సింగ్‌గౌడ్‌ను దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు నియమించారు. మంగళవారం వీరితో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆర్ రత్నం, మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది ఎం కాశీనాథ్ పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు ఎల్లమ్మ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ భక్తుల ఇలవేల్పుగా మారింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఆలయంలో సామూహిక సత్యానారాయణ వ్రతం ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ ఆర్ రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహిస్తాం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ ధ్యాసాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 30న నిర్వహించనున్న సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని బాల మణికంఠ అయ్యప్ప దేవస్థానం ధర్మకర్త ఎం జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి కోరారు. మంగళవారం ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని రాములోరి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు వాసుదేవారెడ్డి, గోపల్ యాదవ్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



మహిళకు కళ్ల అద్దాలు అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

కందుకూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బీ జంగారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని దాసర్లపల్లి తండాలో సర్పంచ్ రమేష్‌నాయక్, ఎంపీటీసీ టీ ఇందిరతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవేందర్, నాయకులు పి.అశోక్, టీ కార్తీక్, బీ దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవత శివాలయ, రామాలయాల్లో కొలువైయున్న శ్రీ కోదండరామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 3రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. వేడుకల్లో భాగంగా శ్రీ సీతారాములవారి పరిణయ మహోత్సవాన్ని తిలకించేందుకు జిల్లాతో పాటు హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ తెలిపారు. హైదరాబాద్ నుంచి 44 కిలో మీటర్ల దూరంలో కడ్తాల్ మండలం మైసిగండి సమీపంలో ఈ ఆలయం ఉంది. ప్రతి 5 నిమిషాలకు కల్వకుర్తి, హైదరాబాద్ నుంచి బస్సు సౌకర్యం కలదని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మృత్యుకుహరాలు.. ట్రాన్స్‌ఫార్మర్లు

- రోడ్డు పక్కనే ప్రమాదకరంగా..
- విస్తరణ పనులు పూర్తయినా ట్రాన్స్‌ఫార్మర్లను మార్చని అధికారులు
- చిన్నపిల్లలకు అందేంత ఎత్తులో..
- రక్షణ చర్యలూ శూన్యం
- ప్రయాణికులకు పొంచివున్న ముప్పు



మీర్‌ఖాన్‌పేట మార్గంలో రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



కందుకూరు మార్గంలో అతి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కందుకూరు: మండల కేంద్రం నుంచి కందుకూరుకు వెళ్లే మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. గతంలో ఇవి రోడ్డుకు కొంత దూరంలో ఉండేవి. ఇటీవల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల వరకు రోడ్డు వేశారు. వాటిని మార్చాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడం, తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఏడాది క్రితం కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. వావిళ్లకుంట తండా నుంచి మీర్‌ఖాన్‌పేట మార్గంలో రోడ్డును విస్తరించారు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం అలాగే వదిలేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు ఆనుకుని తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. కందుకూరు చౌరస్తా నుంచి కందుకూరు వరకు ఉన్న రోడ్డును డబుల్ లేన్‌గా మార్చారు. వ్యవసాయ శా ఖ కార్యాలయం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లకు సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రా న్స్‌ఫార్మర్లను అలాగే వదిలేశారు. ఇది కూడా ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలకు సైతం ట్రాన్స్‌ఫార్మర్లు అందేలా ఉండడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డుకు దూరంగా, ఎత్తులో ఏర్పాటు చేయడంతోపాటు కంచె వేయాలని కోరుతున్నారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> కందుకూరు మార్గంతో పాటు మీర్‌ఖాన్‌పేట మార్గాన్ని ఆర్‌అండ్‌బీ శాఖ విస్తరించింది. ఆ మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను షిఫ్టింగ్ చేయడానికి ఆర్‌అండ్‌బీకి రూ. 25లక్షలు అవసరం. ఈ నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాలేదు. వచ్చిన వెంటనే పనులు చేపడతాం. అంతవరకు ప్రయాణికులు, పాదచారులు అప్రమత్తంగా ఉండాలి. – రమేష్, ఏఈ, కందుకూరు

అధిక పన్నులపై మంత్రిని కలుస్తాం

మీర్‌పేట: పెంచిన ఆస్తి పన్నులు తగ్గించాలని కార్పొరేషన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీవాసులు మంగళవారం రెవెన్యూ అధికారి అంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు రూ. వందల్లో ఉన్న ఇంటి పన్నులు నేడు రూ. వేలల్లో వసూలు చేస్తున్నారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కూడా ఇంత మొత్తంలో పన్నుల పెరగలేదని తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలు నివసించే మీర్‌పేట ప్రాంతంలో అధిక పన్నులతో అందరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధిక పన్నులపై త్వరలోనే మంత్రి సబితారెడ్డిని కలిసి వివరిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కే హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారి అంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆరోగ్య జీవితానికి యోగా అవసరం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



యోగా తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఎంతో ముఖ్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ తరగతుల బ్రోచర్‌ను ఎమ్మెల్సీ బీ దయానంద్ గుప్తాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో మానసికంగా, శారీరకంగా బలంగా ఉండాలంటే యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ఎంతో ఆదరణ ఉందన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 2 నుంచి యోగా శిక్షణ తరగతులు కర్మన్‌ఘాట్‌లోని మంద మల్లమ్మ గార్డెన్స్ వద్దగల లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొనే వారు సెల్ నంబర్ 9603256572లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎం శ్రీనివాసరావు, శ్రీధర్‌గౌడ్, సిద్దిరాజు, తపోవదనగిరి, గోపాలకృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

‘కల్యాణలక్ష్మి’తో పేద కుటుంబాల్లో వెలుగులు

- మంత్రి సబితారెడ్డి
- లబ్ధిదారులకు చెక్కులు అందజేత



మహేశ్వరం: కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: పేదింటి ఆడ బిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశం మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయన్నారు. ఆడ బిడ్డల వివాహానికి మేనమామగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించి అందుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి.మహమూద్ అలీ, వైస్ ఎంపీపీ సునిత, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సీ సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ నర్సింహ, ఆర్‌ఐలు పావని, స్వర్ణకుమారి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో ఆక్రమణలు తొలగించండి

మీర్‌పేట: ఆక్రమణకు గురైన సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేవాలని మంత్రి సబితారెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. మీర్‌పేట టీకేఆర్ కమాన్ నుంచి మంద మల్లమ్మ చౌరస్తా వరకు గల సర్వీస్ రోడ్డును వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఫెడరేషన్ ఆఫ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సర్వీస్ రోడ్డులో ఆక్రమణలు తొలగించడం తోపాటు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనంతరం ఫెడరేషన్ ప్రతినిధులు జోనల్ కమిషనర్‌ను కలిశారు. సర్వీస్ రోడ్డుతో పాటు సైకిల్ ట్రాక్‌ను మూడు నెలల్లోగా నిర్మించి, పచ్చదనాన్ని పెంపొందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీ నర్సింహారెడ్డి, సభ్యులు మల్లారెడ్డి, శివానందం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ఎంపీపీ రఘుమారెడ్డి



ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎంపీపీ రఘుమారెడ్డి

మహేశ్వరం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కే రఘుమారెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని చిన్న తూఫ్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇటీవల జాతీయ స్థాయి అవార్డు వచ్చిన సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు తీసుకురావాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, స్వయం సమృద్ధి, మౌలిక వసతుల కల్పించిన పంచాయతీల విభాగంలో రెండు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునిత, ఎంపీడీఓ నర్సింహ, సర్పంచ్ రఘుపతి గౌడ్, ఉప సర్పంచ్ మమత, ఎంపీటీసీ అనిత, పంచాయతీ కార్యదర్శి రాధ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య గౌడ్, వార్డు సభ్యులు ప్రమీల, టి.లత, డి.రాజేశ్వరీ, నాగరాజు, సందీప్, లింగం, సంజీవ, కోఆప్షన్ సభ్యులు పుష్పమ్మ, రాములు, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్ గౌడ్, రాఘవేందర్ గౌడ్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ దేశానికే ఆదర్శం

కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ కే రఘుమారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న తూఫ్ర గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అంతకుముందు 136 మందికి కంటి పరీక్షలు చేశారు. 27 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మరి కొంత మందికి త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.నర్సింహ, వైస్ ఎంపీపీ సునిత, సర్పంచ్ కే రఘుపతి గౌడ్, ఉప సర్పంచ్ మమత, ఎంపీటీసీ అనిత, వార్డు సభ్యులు ప్రమీల, టి.లత, డి.రాజేశ్వరీ, నాగరాజ్, సందీప్, లింగం, సంజీవ, మండల కో-ఆప్షన్ సభ్యులు పుష్పమ్మ, రాములు, మెడికల్ ఆఫీసర్ డా. సౌమ్య పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో ట్రస్టు సభ్యుడు, డాక్టర్ ఉప్పల అఖిల్ ఆధ్వర్యంలో 265 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపాతి రజిత, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు కొండయ్య, విజయ్, వెంకటేశ్, మహేశ్, శేఖర్, జగన్, అంజద్, కిశోర్, బిక్కు, అనిల్, కృష్ణ, శేఖర్, రమేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

నోడల్ ఆఫీసర్ జంగయ్య

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని నోడల్ అధికారి జంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జంగయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు తమతల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి వారి కలలను నెరవేర్చాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రాఘవేంద్రచారి, జనార్దన్‌రెడ్డి, శోభారాణి, శ్రీనివాసచారి, జంగయ్య, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

జెడ్పీటీసీ జంగారెడ్డి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

కందుకూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సర్పంచ్ సీ శమంతకమణి, ఎంపీటీసీ సీ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల రూపు రేఖలు మారిపోయాయన్నారు. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక కృషితో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎ.వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎం జయేందర్ ముదిరాజ్, వార్డు సభ్యులు డీ మోహన్‌రెడ్డి, పూజిత, ఎస్.వెంకటేష్‌గౌడ్, జి.సుధాకర్‌రెడ్డి, ఎస్.రాంరెడ్డి, పార్టీ నియోజకవర్గం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ టీ కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బీ దీక్షిత్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, గణేష్, రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే ఏదైనా సాధ్యం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: కష్టపడి చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగూడ పరిధిలోని హైదరాబాద్ టెక్నో స్కూల్ వార్షికోత్సవాన్ని ఆ స్కూల్ నిర్వాహకుడు ఎస్.రఘురాంరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం చదువులో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం జ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి, జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ కే పాండురంగారెడ్డి, మీర్‌ఖాన్‌పేట ఎంపీటీసీ కే రాములు, స్కూల్ ప్రిన్సిపాల్ కవితారెడ్డి, నాయకులు వీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్ అభివృద్ధికి సహకరించండి

మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో జంక్షన్ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. చౌరస్తాలో జంక్షన అభివృద్ధికి పాలకవర్గం తీర్మానం చేయడం జరిగిందని, అందులో భాగంగానే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని కోరారు.

చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

కమిషనర్ శ్యాంసుందర్



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్యాంసుందర్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీని చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ సిబ్బంది, స్థానిక యువజన సంఘాల సభ్యులకు స్వచ్ఛభారత్ మిషన్, పట్టణ ప్రగతిపై అవగాహన కల్పించారు. చెత్తను సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో స్వచ్ఛ మహిళా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్‌పై మహిళా సంఘాల సభ్యులకు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అసంపూర్తి నాలాలు పూర్తి చేయండి

మేయర్‌ను కోరిన పలు కాలనీల వాసులు



మేయర్ పారిజాతకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

బడంగ్‌పేట్: రెండేళ్ల క్రితం ఆగిన ఎస్‌డీపీ (స్పెషల్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పలు కాలనీల ప్రజలు మంగళవారం మేయర్ చిగురింత పారిజాతను కోరారు. ఈ సందర్భంగా 20, 23 డివిజన్ కాలనీల ప్రజలు మాట్లాడుతూ.. అర్ధాంతరంగా ఆగిన నాలా పనుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఏటా భారీ వర్షాలు వచ్చినప్పుడు వరదలకు కాలనీలు నీట మునుగుతున్నాయని తెలిపారు. దీంతో సర్వం కోల్పోతున్నామని వివరించారు. వరదల నుంచి విముక్తి కల్పించేందుకు రెండేళ్ల క్రితం స్పెషల్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా పనులు మొదలు పెట్టారని, తర్వాత ఆపేశారని తెలిపారు. మారుతినగర్, రోమా -1, ఎస్‌బీఆర్, లక్ష్మీనగర్, సాయిప్రభ హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, బీరప్ప కాలనీ, వైష్ణవి కాలనీలు వరదలకు మునిగిపోతాయని తెలిపారు. వెంటనే నాలా పనులు పూర్తి చేసి కాలనీలకు ముంపు నుంచి శాశ్వత విముక్తి కల్పించాలని కోరారు. అలాగే 20వ డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. స్పందించిన మేయర్ పారిజాత నాలా పనులను వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మిగిలిన సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మేయర్‌ను కలసిన వారిలో 23వ డివిజన్ కార్పొరేటర్ ఆర్ సంతోషి, 20వ డివిజన్ కార్పొరేటర్ పీ సుదర్శన్ రెడ్డి, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు మల్లయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, సుధాకర్, సురేష్, కృష్ణసాగర్, యాదిరెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

పరస్పర సహకారంతో పండుగలు



పండుగల నిర్వహణపై సూచనలు ఇస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

మీర్‌పేట: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని మీర్‌పేట సీఐ ఎం మహేందర్‌రెడ్డి సూచించారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మీర్‌పేట ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పీఎస్ పరిధిలో 40 చోట్ల సీతారాముల కల్యాణం, పల్లకీ ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు, పోలీసుల పరస్పర సహకారంతో పండుగలను నిర్వహించుకోవాలన్నారు. అనంతరం రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మసీదు కమిటీ సభ్యులకు సీఐ సూచనలు చేశారు. సమావేశంలో ఎస్‌ఐలు బద్యానాయక్, సత్యనారాయణ, ఉదయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.